సాక్షి
విశాఖపట్నం
ఆదివారం। 24। మార్చి। 2024




అనంతుని తెప్పోత్సవం

అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అనంతునికి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. IIలో



క్షయకు చెక్ పెట్టొచ్చు

క్షయ వ్యాధికి పూర్తిగా చెక్ పెట్టొచ్చు. క్రమం తప్పకుండా మందులు వాడితే నివారణ సాధ్యమేనని వైద్యులు తెలిపారు. IIలో



సాధారణ స్పెషల్ రైళ్లు

చెన్నై ఎగ్మోర్–సంత్రాగచ్చి–చెన్నై ఎగ్మోర్ మధ్య సాధారణ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. IIలో





• నాడు గోరంత.. నేడు కొండంత

గంగపుత్రులకు జీవన భరోసా



- మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- పలు సంక్షేమ పథకాలతో మేలు
- భీమిలి మండలంలో రూ.24.86 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్
- చేపల తిమ్మాపురంలో రూ.56 లక్షలతో ఫిష్ డ్రైయింగ్ ప్లాట్‌ఫాం

మత్స్యకార భరోసా
- రూ. 4 వేల నుంచి రూ.10 వేలకు పెంపు
- 2014–19లో రూ.20 కోట్లు.. 2019–24లో రూ.61.02 కోట్లు చెల్లింపు

డీజిల్ సబ్సిడీ
- రూ.6.03 నుంచి రూ.9కి పెంపు
- నాడు 318 మందికి.. నేడు 1,138కి వర్తింపు
- 2014–19 రూ.10 కోట్లు చెల్లించగా 2019–24లో రూ.40 కోట్లు అందజేత

ప్రమాద బీమా
- రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు

కిసాన్ క్రెడిట్ కార్డులు
- 1,330 మందికి కిసాన్ క్రెడిట్ కార్డులు
- రూ.7.86 కోట్ల మేర రుణాలు

పింఛన్లు
- పింఛన్ల వయసు 50 ఏళ్లకు తగ్గింపు
- రూ.వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంపు
- మొత్తం 3,574 మందికి అందజేత

సాక్షి, విశాఖపట్నం: మత్స్యకారులను ఓటు బ్యాంకుగానే చూసిన అప్పటి టీడీపీ ప్రభుత్వం వారి బాగోగులను పట్టించుకోలేదు. గోరంత సాయంతో చేతులు దులుపుకుని అదే కొండంతలా ప్రచారం చేసుకుంటూ వారి ఓట్లను వలలో వేసుకుంటూ వచ్చింది. దీంతో అంతంతమాత్రంగా సాగే వీరి బతుకులు టీడీపీ పాలనలో ఎదుగూ బొదుగూ లేకుండా పోయాయి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వీరి జీవితాలకు సరికొత్త భరోసా లభించింది. వీరి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అండగా నిలిచాయి. ఏటా ఏప్రిల్ 15 నుంచి రెండు నెలల పాటు వేట నిషేధం అమలులో ఉంటుంది. ఆ సమయంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు వీరికి రూ.4 వేల భృతి చెల్లించేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ పరిహారాన్ని రూ.10 వేలకు పెంచింది. మత్స్యకారుల బోట్లకు టీడీపీ హయాంలో డీజిల్ సబ్సిడీ లీటరుకు రూ.6.03 మాత్రమే చెల్లించేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ సొమ్ము రూ.9కి పెంపుదల జరిగింది. ప్రమాదవశాత్తూ వేటకెళ్లిన మత్స్యకారుడు చనిపోతే ఇచ్చే రూ.5 లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచింది. 50 ఏళ్లు నిండిన మత్స్యకారుడికి నెలకు ఇస్తున్న పెన్షన్ సొమ్ము రూ.వెయ్యి నుంచి రూ.3 వేలు చేసింది. మరోవైపు భీమునిపట్నం మండలంలో రూ.24.86 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. రూ.56 లక్షలతో చేపల తిమ్మాపురంలో ఫిష్ డ్రైయింగ్ ప్లాట్‌ఫాంను అందుబాటులోకి తెచ్చింది.

ప్రయోజనాలు ఇలా..

విశాఖ జిల్లా మత్స్యకారులకు 2019 వరకు కేవలం 318 మందికే డీజిల్ సబ్సిడీ వర్తింపజేయగా, వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఆ సంఖ్య 1,138కి పెంచారు. అంటే టీడీపీ హయాంతో పోల్చుకుంటే దాదాపు నాలుగు రెట్ల మందికి లబ్ధి చేకూరుతోంది. ఇలా 2014–19 వరకు టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో సుమారు రూ.10 కోట్లు మాత్రమే సబ్సిడీ సొమ్ము ఇవ్వగా గడిచిన ఐదేళ్లలో సుమారు రూ.40 కోట్లు చెల్లించారు. అలాగే టీడీపీ పాలనలో వేట నిషేధ భృతి రూ.20 కోట్లు పరిహారంగా చెల్లిస్తే, వైఎస్సార్‌సీపీ వచ్చాక రూ.61.02 కోట్లు మత్స్యకార భరోసా కింద అందించారు. టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు వేట నిషేధ సమయంలో ఇచ్చే అరకొర పరిహారాన్ని ఏడాదికో, రెండేళ్లకో ఇచ్చేవారు. బోట్ల డీజిల్ సబ్సిడీ సొమ్ము కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసేవారు. కానీ ఇప్పుడు నిషేధ పరిహారం వెనువెంటనే అందిస్తున్నారు. బోట్లకు డీజిల్ వేయించుకునేటప్పుడే డీజిల్ సబ్సిడీ సొమ్మును మినహాయింపు నిస్తున్నారు. దీంతో డీజిల్ రాయితీ రూ.6 నుంచి 9కి పెరగడం, ముందుగానే సబ్సిడీ మినహాయింపునివ్వడంతో మత్స్యకారులు ఎంతో ఊరట చెందుతున్నారు. జిల్లాలో 50 ఏళ్ల వయసు మీరిన మత్స్యకారులు 3,574 మందికి నెలకు రూ.3 వేల చొప్పున పెన్షన్ అందుకుంటున్నారు. అలాగే ప్రభుత్వం మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేసింది. అతి తక్కువ వడ్డీ రేటుకే రుణాలు పొందే అవకాశం కల్పించింది. జిల్లాలో ఇప్పటివరకు 1,330 మంది కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.7.86 కోట్లు రుణాలు పొందారు.

మాలో సంతోషాన్ని నింపారు



టీడీపీ హయాంలో వేట నిషేధ భృతి రూ.4 వేలే ఇచ్చేవారు. అది కూడా మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగితే ఏడాదికో, రెండేళ్లకో వచ్చేది. లీటరు డీజిల్‌పై ఇచ్చే సబ్సిడీ సొమ్ము కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసేవాళ్లం. ముఖ్యమంత్రి జగన్ డీజిల్ సబ్సిడీ రూ.9కి, నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచడమే కాదు.. సబ్సిడీ సొమ్మును ముందుగానే మినహాయిస్తున్నారు. భృతిని సకాలంలోనే చెల్లిస్తున్నారు. టీడీపీ పాలనలో 60 ఏళ్లు దాటిన మత్స్యకారుడికి రూ.వెయ్యి పెన్షన్ ఇస్తే సీఎం జగన్ వారి వయసును 50కి తగ్గించి రూ.3 వేలకు పెంచారు. మత్స్యకారుల్లో సంతోషాన్ని నింపారు.

– **వాసుపల్లి నల్లబాబు**, మత్స్యకారుడు, మంగమారిపేట

ఊరందరికీ సాయం



మాకు వరుసగా మత్స్యకార భరోసా కింద రూ.10 వేలు ఆర్థికసాయం అందింది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రూ.4 వేలు కూడా సరిగ్గా ఇచ్చేవారు కాదు. అందులోనూ రాజకీయమే. టీడీపీకి అనుకూలంగా ఉన్నవాళ్లకే ఇచ్చేవారు. జగనన్న ప్రభుత్వం హయాంలో వేటకు వెళ్లడం మానేసిన నెలరోజులకే డబ్బులు మా బ్యాంకు ఖాతాలో పడ్డాయి. పార్టీలతో సంబంధం లేకుండా వేటకు వెళ్లే అందరికీ అందించారు. అప్పుడు ఊర్లో సగం మందికి అందితే ఇప్పుడు ఊరందరికీ అందింది.

– **యజ్జల అప్పలరాజు**, రాజయ్యపేట, నక్కపల్లి

అభివృద్ధి అంటే ఇంకేమి కావాలి?



సీఎం వైఎస్ జగన్ మత్స్యకారులకు చెప్పినవన్నీ చేసి చూపించారు. 40–50 ఏళ్లుగా ఎవరూ చేయని విధంగా రాష్ట్రంలో ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, పది ఫిషింగ్ హార్బర్లు, నాలుగు పోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. వీటివల్ల మత్స్యకారుల వలసలు తగ్గిపోతాయి. అమ్మ ఒడి, విద్యాదీవెనల ద్వారా మత్స్యకారుల పిల్లల జీవితాల్లో మార్పు వచ్చింది. ఇన్నాళ్లు స్కూలు ముఖం చూడని ఈ పిల్లలు కార్పొరేట్ విద్యను అభ్యసిస్తున్నారు. అభివృద్ధి అంటే ఇంకేమి కావాలి?

– **తెడ్డు శంకర్**, కార్యదర్శి, ఫిషర్‌మెన్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్

మత్స్యకారులకు అండగా నిలిచారు



వేట గిట్టుబాటు కాక సతమతమవుతున్న మత్స్యకారులకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. డీజిల్‌పై సబ్సిడీని పెంచడం, వేట నిషేధ భృతిని భారీగా పెంచడం, పెన్షన్ వయసు 50 ఏళ్లకు తగ్గించి.. ఇచ్చే సొమ్మును రూ.3 వేలకు పెంచడం, వేటకెళ్లి చనిపోతే ఇచ్చే రూ.5 లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంపు వంటి వాటితో భరోసానిచ్చారు. మత్స్యకారుల జీవనశైలిలో మార్పుకు నాంది పలికారు. మత్స్యకారుల సంక్షేమానికి చిరునామాగా నిలిచారు.

– **సూరాడ సత్తిబాబు**, బోటు యజమాని, ప్రధాన కార్యదర్శి, వైశాఖి డాల్ఫిన్ బోట్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం

ఈవీఎం గొడౌన్‌కు పటిష్ట రక్షణ



వీవీ ప్యాట్‌లు పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం గొడౌన్‌కు మరింత పటిష్టమైన రక్షణ కల్పించాలని ఎన్నికల విభాగం అధికారులను కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. రూరల్ రెవెన్యూ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను శనివారం ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈవీఎం పెట్టెలను తెరిచి అందులో వీవీ ప్యాట్‌లను పరిశీలించారు. వాటి గురించి పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. గోదాంలో సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీవీ ప్యాట్‌లకు పటిష్టమైన రక్షణ కల్పిస్తున్నామన్నారు. సీసీ కెమెరాలు సక్రమంగా పని చేస్తున్నాయని, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం రూరల్ తహసీల్దారు కార్యాలయం ఆధునికీకరణ పనులను పరిశీలించారు. భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి, ఈవీఎం మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి టి.ప్రవీణ, రూరల్ తహసీల్దారు ఎం.శివన్నారాయణ, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

లైంగిక వేధింపుల ఆరోపణలతో వైద్యుడి సస్పెన్షన్

మహారాణిపేట: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజీహెచ్ పిల్లల వైద్యుడు డాక్టర్ రొక్కం భవానీశంకర్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్(డీఎంఈ) డాక్టర్ నరసింహం ఉత్తర్వులు జారీ చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. డీఎంఈ నుంచి వచ్చిన ఉత్తర్వులను సంబంధిత వైద్యుడికి అందజేసినట్లు ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు.

అప్పన్నకు పెళ్లిచూపులు రేపు



సింహాచలం: ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని వరాహ లక్ష్మీనరసింహస్వామికి సోమవారం పెళ్లి చూపులు జరగనున్నాయి. స్వామి పెళ్లికుమారుడిగా ముస్తాబై సింహగిరి నుంచి కొండదిగువకి విచ్చేసి కొండదిగువ పుష్కరిణి సత్రంలోని ఉద్యానవన మండపంలో డోలోత్సవం నిర్వహించుకోనున్నాడు. పెళ్లి నిశ్చయం అయిన ఆనందంతో అడవివరంలో తిరువీధి జరుపుకుంటాడు. వరాహ లక్ష్మీనృసింహస్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకీలో అధిష్టింపజేసి సోమవారం ఉదయం 6.30 గంటల సమయంలో కొండదిగువకి మెట్ల మార్గం ద్వారా తీసుకొస్తారు. అక్కడి నుంచి అడవివరం గ్రామదేవత పైడితల్లి ఆలయానికి తిరువీధిగా తీసుకెళ్తారు. అక్కడి నుంచి పుష్కరిణి సత్రంలో ఉన్న ఉద్యానవన మండపానికి తీసుకెళ్లి స్వామిని డోలీలో అధిష్టింపజేస్తారు. వసంతోత్సవం, చూర్ణోత్సవం, డోలోత్సవాన్ని నిర్వహిస్తారు. సోమవారం నిత్యకల్యాణం రద్దు చేసినట్టు ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

అందుబాటులో శ్రీవారి అగరబత్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ దేవస్థానం తయారు చేసిన అగరబత్తులు అందుబాటులో ఉన్నట్లు ఆలయ ఏఈవో జగన్‌మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. రూ.45 నుంచి కాంబో ప్యాక్ రూ.450 వరకు విలువైన అగరబత్తులు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోక్సో చట్టం.. చిన్నారులకు రక్షణ కవచం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: బాలికలకు ఎటువంటి హాని జరగకుండా.. వారిని రక్షించే బాధ్యత అందరిదీ అని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ భవనంలో పోక్సో చట్టం–2012, మోటారు వాహన ప్రమాద చట్టం, తదితర అంశాలపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, బాలికలు, యువతులు, కౌమార దశ బాలికలను తల్లిదండ్రులతో పాటు సమాజం కూడా తగిన రక్షణ కల్పించాలన్నారు. పోక్సో చట్టం సెక్షన్ 7, 8, 12 గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఏ ఒక్క బాలికకు అన్యాయం జరిగినా.. అది వారి జీవితాలతోపాటు సమాజంపై కూడా ప్రభావం చూపుతుందన్నారు. ఇటీవల వయసుతో పని లేకుండా మానవ మృగాలు చేస్తున్న అకృత్యాలపై న్యాయస్థానాల సైతం తీవ్రంగా స్పందిస్తున్నట్లు చెప్పారు. పోక్సో చట్టం చిన్నారులకు ఒక రక్షణ కవచంగా అభివర్ణించారు. ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ చిన్నారులు ఉన్నత విద్యావంతులుగా రాణించాలని కోరారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. బాలల భద్రత–న్యాయ సేవా సంస్థ అందిస్తున్న సేవలపై రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. వెంకటరమణ ప్రసంగించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైల శ్రీనివాసరావు పలు అంశాలపై మాట్లాడారు. న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

ముత్తంశెట్టికి జనహారతులు

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన, అభివృద్ధి సాధ్యం



ఎన్నికల ప్రచారంలో భాగంగా పరదేశిపాలెం -2 కాలనీలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి

మధురవాడ/పద్మనాభం: ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. జీవీఎంసీ మధురవాడ జోన్ బోయిపాలెం సమీపంలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పీపీ– 2 కాలనీ, పద్మనాభం మండలం బాందేవుపురం, విలాస్కాన్‌పాలెం గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ఆయనకు ప్రజలు హారతులు పట్టి.. సాదరంగా ఆహ్వానించారు. వారికి ముత్తంశెట్టి ప్రభుత్వం ద్వారా జరిగిన మేలు, అభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.

అనంతరం మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. అభివృద్ధి జరగాలన్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు ఎంత మందితో కలిసి వచ్చినా మళ్లీ ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండాయేనని చెప్పారు. ఎన్నికలు వచ్చిన తర్వాతనే టీడీపీ, దాని జట్టు పార్టీలకు ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. వారి బెదిరింపులు, ప్రలోభాలకు ఎవ్వరూ గురికావద్దని కోరారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించినట్టు తెలిపారు.

పాలిటెక్‌లో ఎన్‌బీఏ బృందం పర్యటన

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని ఎన్‌బీఏ బృందం శనివారం సందర్శించింది. ఈ కాలేజీ నేషనల్ బోర్డ్ అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసింది. ఇందుకనుగుణంగా కాలేజీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పూర్తిస్థాయి బోధన, బోధనేతర సిబ్బందితోపాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. కమిషనర్ సీహెచ్ నాగరాణి ఆదేశాల మేరకు సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, మెటలర్జీ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు కోసం దరఖాస్తు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు నేతృత్వంతో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ నుంచి వచ్చిన తిరుచ్చి ఎన్ఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ నూరుల్ హక్ చైర్మన్‌గా ఐదుగురు సభ్యుల బృందం కళాశాలను సందర్శించింది. ఈ మేరకు కళాశాల భవన సదుపాయం, ప్రాంగణంలోని మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు అనుసరిస్తున్న బోధనాభ్యసన విధానాలు, తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర సదుపాయాలను బృంద సభ్యులు నిశితంగా పరిశీలించి రికార్డు చేశారు. వీరు తయారు చేసిన నివేదికను ఎన్‌బీఏకు సమర్పిస్తారు. అనంతరం ఎన్‌బీఏ గుర్తింపు మంజూరు చేస్తారు. ఇప్పటికే కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ రాష్ట్రంలోనే అతిపెద్ద కాలేజీగా గుర్తింపు పొందింది. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలోనూ ముందంజలో ఉంది.



యోగాసనాలు వేస్తున్న భారత, అమెరికా నౌకాదళాల సిబ్బంది

సింధియా: విశాఖపట్నంలో భారత్, అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్న 'టైగర్ ట్రయంఫ్–24'లో భాగంగా రెండు నౌకాదళాలకు చెందిన సిబ్బంది శనివారం యోగా సెషన్‌లో పాల్గొన్నారు. ఇరుదేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించే దిశగా సాగుతున్న ఈ హార్బర్ ఫేజ్ విన్యాసాల్లో శారీరక, మానసిక దారుఢ్యం కోసం యోగాసనాలు వేసినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

బ్లాక్ కరెన్సీ కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలించిన ఎయిర్‌పోర్టు పోలీసులు
- కారు, 10 ఫోన్లు స్వాధీనం

గోపాలపట్నం: బ్లాక్ కరెన్సీ కేసులో ప్రధాన నిందితుడు షేక్ అబ్దుల్ గని అలియాస్ గనిరాజును ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్ట్ చేసి, శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. గత నెల 20న కాకానినగర్‌లోని ఓ ట్రావెల్స్ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న బ్లాక్ కరెన్సీ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేశారు. విశాఖకు చెందిన కోసుంపూరి వెంకట కనకదుర్గరాజు అలియాస్ భాస్కరరావు, పశ్చిమ గోదావరి జిల్లా యండగండికి చెందిన మద్దాల శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3 కోట్ల విలువైన మూడు బ్యాగుల్లో బ్లాక్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా.. దీనికి సూత్రధారి గనిరాజు అని వారు వెల్లడించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అప్పటి నుంచి అతని కోసం గాలిస్తున్నారు. కాగా.. శుక్రవారం కాకానినగర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కారులో ఉన్న గనిరాజును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా నల్లటి రంగు పూసిన కాగితాలను రసాయనంలో ముంచితే అసలు కరెన్సీగా మారుతుందని నమ్మించి మోసానికి పాల్పడుతున్నట్లు తెలిపాడు. అతనిది కాకినాడ దగ్గరలోని పెనుమర్తి ప్రాంతం. పదేళ్ల కిందట నిందితుడిపై దొంగనోట్ల మార్పిడి కేసు నమోదైంది. అతని నుంచి కారు, 10 మొబైల్ ఫోన్లు, బంగారు చైన్, వాచ్ స్వాధీనం చేసుకున్నారు. శనివారం అతన్ని రిమాండ్‌కు తరలించారు.

'సీ-విజిల్' ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

మహారాణిపేట: సీ–విజిల్ కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఎన్నికల నియామవళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి శనివారం వరకు 62 ఫిర్యాదులు రాగా.. వాటన్నింటిని పరిష్కరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పార్టీల ఖర్చులు, అభ్యర్థుల ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలకు సంబంధించిన వాటిపై ఎన్నికల కమిషన్ రూపొందించిన సీ–విజిల్ యాప్‌కు ఫొటోలు, వీడియోలు రూపంలో అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో సీ–విజల్ కంట్రోల్ రూమ్ విచారణ చేపట్టి ఎన్నికల కమిషన్‌కు పంపుతారు. ఇలా జిల్లాకు సంబంధించి 62 ఫిర్యాదుల్లో ఎక్కువగా విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి వచ్చాయి. భీమిలి నుంచి 4, గాజువాక 5, పెందుర్తి 10, విశాఖ తూర్పు 11, విశాఖ ఉత్తర 13, విశాఖ దక్షిణ 9, విశాఖ తూర్పు నుంచి 10 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.


శిల్పారామంలో రూ.3 కోట్లతో కల్యాణ మండపం



శిల్పారామంలో పర్యటిస్తున్న స్పెషల్ అధికారి శ్యామ్ సుందర్ రెడ్డి

పీఎం పాలెం : జీవీఎంసీ నాలుగో వార్డు పరిధి శిల్పారామంలోని కల్యాణ మండపాన్ని పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం కింద రూ.3 కోట్లతో అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రతిపాదనల దశ పూర్తవడంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని రాష్ట్ర శిల్పారామాల స్పెషల్ ఆఫీసర్ డి.శ్యామ్ సుందర్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన శిల్పారామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ప్రతిష్ట ఇనుమడించేలా అత్యాధునిక వసతులతో కల్యాణ మండపం అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిల్పారామం నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సందర్శకులను ఆకర్షించడానికి ఇప్పుడున్న స్విమ్మింగ్ పూల్‌తోపాటు మరిన్ని హంగులు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. పర్యటనలో ఆయనవెంట స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి, సూపర్‌వైజర్ ప్రసాద్ రెడ్డి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో క్షయకు చెక్



- క్రమం తప్పకుండా మందులు వాడటం ముఖ్యం
- నేడు క్షయ నివారణ దినం

మహారాణిపేట: విశాఖ జిల్లాలో క్షయ(టీబీ) బాధితుల సంఖ్య పెరుగుతోంది. వైద్యశాఖ వ్యాధి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించినప్పటికీ కేసుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో 50 ఏళ్లకు పైబడిన వారే ఈ వ్యాధి బారిన పడుతుండే వారు. మారుతున్న జీవన విధానం, తగ్గుతున్న వ్యాధి నిరోధకశక్తి కారణంగా కొన్నేళ్లుగా పిల్లలు కూడా క్షయ వ్యాధి బారిన పడుతున్నారు. క్షయ వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా పూర్తిస్థాయిలో నిరోధించలేకపోతున్నారు. జాతీయ క్షయ నివారణ కార్యక్రమం కింద క్షయ వ్యాధి నిర్మూలనకు వైద్య ఆరోగ్య శాఖ వివిధ చర్యలు తీసుకుంటోంది. అప్రమత్తతతో పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ నివారణ సాధ్యమేనని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఆదివారం(ఈ నెల 24వ తేదీ) ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం..

లక్షణాలివే..

క్షయ ఒక అంటువ్యాధి. రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు రోగ క్రిములు ఇతరులకు వ్యాపిస్తాయి. ఎవరికైనా వ్యాధి సోకితే రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు, ఆకలి తగ్గుదల ఉంటుంది. దగ్గినప్పుడు క్షయ క్రిములు గాలి ద్వారా వ్యాపిస్తాయి. రోగి ఊపిరితిత్తుల నుంచి వచ్చే కఫం ద్వారా ఈ బాక్టీరియా గాలిలో చేరి, దగ్గరలో ఉన్న ఆరోగ్యవంతుడు పీల్చే గాలితో పాటు అతని ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించి జబ్బుకు పునాది వేస్తుంది. ఉమ్మినప్పుడు రక్తం పడటం వంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాల్సి ఉంటుంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీబీ పరీక్షలు ఉచితంగా చేస్తారు. క్షయపై అవగాహన కార్యక్రమం ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 9 గంటలకు జరగనుంది. ఈ నెల 4 నుంచి 24 వరకు క్షయ వ్యాధి నిర్మూలనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అవగాహన సదస్సులు నిర్వహించింది.

5,120 మంది బాధితులు

జిల్లాలో 25 పరీక్ష కేంద్రాలు, రెండు సిబి నాట్‌ల ద్వారా రోగికి టీబీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. వ్యాధిగ్రస్తులకు 24 గంటల్లో మందులు సరఫరా చేస్తున్నారు. గతేడాది 2023 మార్చి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 5,120 మంది టీబీ మందులు వాడుతున్నారు. గతంలో 2077 మంది ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య పెరిగింది. టీబీ బాధితుల కోసం ప్రభుత్వ ఛాతి, అంటు వ్యాధుల ఆస్పత్రిలో 30 పడకలు కూడా కేటాయించారు. మల్టీ డ్రగ్ రెసిడెంట్ ద్వారా మొండి క్షయ వ్యాధిగ్రస్తులకు వైద్య సహాయం ఉచితంగా అందిస్తున్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయ బాధితులకు వివిధ ఫార్మా కంపెనీలు, వివిధ ప్రభుత్వ అధికారులు, వివిధ సంస్థలు అదనపు పోష్టికాహారం అందించేందుకు జిల్లా క్షయ నివారణా సిబ్బందికి సహకారం అందిస్తున్నాయి. టీబీ నివారణకు క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు చికిత్స తీసుకున్న బాధితులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు కూడా అందిస్తుంది. ప్రతి ఒక్కరు తమ వంతు ప్రయత్నంగా ముందుకు వచ్చి క్షయ వ్యాధి రహిత సమాజాన్ని నిర్మూలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు.

అందుబాటులో టీబీ మందులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీబీ నివారణ కోసం మందులను ఉచితంగా అందిస్తున్నాయి. వైద్యం కూడా పూర్తిగా ఉచితం. టీబీ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు, సేవ చేసే వారికి వ్యాధి సోకకుండా మందులు అందుబాటులో ఉన్నాయి. అదనపు పోషకాహారంతో పాటు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నివారణ సాధ్యమే.

– డాక్టర్ సీహెచ్.పూర్ణేంద్రబాబు, జిల్లా టీబీ నివారణాధికారి, విశాఖపట్నం

ఘనంగా అనంతుని తెప్పోత్సవం



పద్మనాభం: కుంతీమాధవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అనంతుడికి తెప్పోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా విశేష హోమం, గ్రామ బలిహరణం చేపట్టారు. అనంతరం శ్రీదేవీ భూదేవీ సమేత అనంత పద్మనాభస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా పద్మనాభం కూడలి సమీపంలోని పుష్కరిణి గట్టు వద్దకు తోడ్కొని వచ్చి విశేష పూజలు నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఆశీనులు గావించి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఐదుసార్లు పుష్కరిణిలో వాహనంలో విహరింపజేశారు. నెలిమర్ల శ్రీదుర్గా మహాపీఠం పీఠాధిపతి శ్రవణ చైతన్య చిన స్వామి, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ తాళాడ పాప, ఎంపీటీసీ కంటుబోతులక్ష్మి, ఈవో నానాజీబాబు పాల్గొన్నారు.

నేడు అనంతుడి రథోత్సవం

కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ విశేష ఏర్పాటు చేసింది. ఉదయం విశేష హోమం, గ్రామ బలిహరణం, మంగళాశాసనం నిర్వహిస్తారు. సాయంత్రం వైదిక సదస్యం, రాత్రి విశేష హోమం, గ్రామ బలి హరణం, మంగళాశాసనం తదితర పూజా కార్యక్రమాలు చేపడతారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత అనంతుడి ఉత్సవ విగ్రహాలను రథం వద్దకు తోడ్కొని వచ్చి..అధిష్టింపజేస్తారు. పౌర్ణమి గడియలు ప్రవేశించగానే ఆలయ గాలి గోపురం నుంచి రథోత్సవం ప్రారంభమవుతుంది. అనంతుడి రథచక్రాలు రాజవీధి గుండా ముందుకు కదులుతాయి. ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు రథోత్సవానికి అవసరమయ్యే ఏర్పాట్లు పూర్తి చేశారు.

చెన్నై ఎగ్మోర్-సంత్రగచ్చి మధ్య సాధారణ స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : హోలీ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చెన్నై ఎగ్మోర్-సంత్రగచ్చి-చెన్నై ఎగ్మోర్ మధ్య సాధారణ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. చెన్నై ఎగ్మోర్-సంత్రగచ్చి(06077) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ ఈ నెల 23, 30, ఏప్రిల్ 6వ తేదీల్లో (ప్రతీ శనివారాలలో) చెన్నై ఎగ్మోర్‌లో రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.54 గంటకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి మధ్యాహ్నం 1.59 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.15 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సంత్రగచ్చి-చెన్నై ఎగ్మోర్(06078) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ ఈ నెల 25, ఏప్రిల్ 1, 8వ తేదీల్లో సంత్రగచ్చిలో ఉదయం 10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 1.48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.50 గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది.

స్టీల్‌ప్లాంట్ భూముల ఆక్రమణ.. 14 మందిపై కేసు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూమిలో కొంత మంది వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడినట్లు వీఎస్‌పీ అథారిటీ ఇచ్చిన ఫిర్యాదుతో దువ్వాడ పోలీసులు రంగంలోకి దిగారు. మొత్తం 14 మందిపై శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. స్టీల్ ప్లాంట్ విస్తరణలో భాగంగా 1990లో చింతా సూర్యనారాయణరెడ్డి, పోతిరెడ్డిల నుంచి అగనంపూడి సర్వే నంబరు 56, 1ఏ2, ఏ3, 1, 2ఏలో సుమారు 6.88 ఎకరాలను ఉక్కు కర్మాగారం సేకరించింది. అప్పటి నుంచి ఆ భూమి ఖాళీగా ఉండడంతో దానిని తిరిగి తమకు అప్పగించాలని కోరుతూ కొంతమంది వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేయడంతో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు యథాస్థితిని కొనసాగించమని పెండింగ్‌లో పెట్టింది. కాగా.. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఆ భూమి ఎస్సీలకు ఇచ్చారని, ఆ భూమి తమదంటూ మరికొందరు ఆక్రమించుకునేందుకు ప్రహరీ పగలకొట్టారు. దీనిపై వీఎస్‌పీ అథారిటీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆక్రమిత భూమి వద్ద విచారిస్తున్న దువ్వాడ పోలీసులు